క్లుప్తంగా

నర్వ ఎంఈఓగా రాంరెడ్డి



నర్వ: మండల నూతన ఎంఈఓగా శనివారం మధ్యాహ్నం రాంరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూరం వెంకటేష్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు, తోటి జీహెచ్ఎంలు, హెచ్ఎంలు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెద్దకడ్మూర్ జీహెచ్ఎంలు భాగ్యలక్ష్మీ, మధుసూధన్, కల్వాల్ హెచ్ఎం బషీర్ అహ్మద్, రాఘవరెడ్డి, వెంకటేష్, వేణుగోపాల్, నరేష్, జనార్ధన్, వెంకటరత్న, పద్మలత, ఎంఆర్సీ సిబ్బంది రైసభాను, సీఆర్పీ నర్సింములు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మరికల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ బుచ్చయ్య అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని మణికంఠ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ రహిత వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా రహస్యంగా డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు వాటర్ ట్యాంకు వితరణ



మక్తల్: మక్తల్ పట్టణంలో క్రీడా మైదానంలో ఉన్న డిగ్రీ కళాశాలకు మన్నానీ రాగమ్మ నారాయణ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు వాటర్ ట్యాంకును వితరణ చేశారు. ఈ మేరకు శనివారం మన్నాని రుక్మిణీ అంపయ్య చేతుల మీదుగా ట్యాంకును కళాశాల సిబ్బందికి అందజేశారు. వాటర్ ట్యాంకును మక్తల్ మాజీ ఉప సర్పంచు కట్ట సురేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు నాగరాజు, ప్రిన్సిపల్ నారాయణగౌడ్, శ్రీనివాస్, కిషోర్, రంజిత్, తిమ్మన్న పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లలో చేసిన అభివృద్ధిని, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని షాగార్డెన్‌లో 'వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు వెంకటయ్య, గోపాల్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అబ్దుల్ నబీ, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో మద్దూరు ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన కంప్యూటర్లను ఎంఈఓ బాలకిష్టప్ప, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డిలు శనివారం మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. 20 మంది విద్యార్థులకు ఒక కంప్యూటర్ అందజేసినట్లు తెలిపారు. మద్దూరు మండలానికి మొత్తం 124 కంప్యూటర్లు వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, అశోక్, సీఆర్పీలు కాశప్ప, కృష్ణారెడ్డి, ఆయా పాఠశాల హెచ్ఎంలు పాల్గొన్నారు.



బొమ్మన్‌పాడు పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు



చిట్యాలలో యోగా కార్యక్రమం



నేరడగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో యోగాసనాలు



కున్సీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



దామరగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయలతో పాటు కళాశాలల్లో యోగాసనాలు వేసి యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. యోగాను జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు.

■ నారాయణపేటలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో సేవా భారతి, పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అలాగే ఇటీవల యోగాతో కలిగే ఉపయోగాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన 40 మంది విద్యార్థులకు స్థానిక అభినందన గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పాలమూర్ విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పాలమూర్ జిల్లా. అధ్యక్షుడు రాందేవ్ రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

■ కోస్గిలో వాకర్స్ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగా సాధకులు శ్రీ భద్రయ్య హాజరై యోగాసనాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

■ నర్వ మండలంలోని పీహెచ్‌సీలో రోగులు, వైద్య సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. పీహెచ్‌సీ వైద్యులు డా.వెంకటరమణ మాట్లాడుతూ మనిషిలోని పంచేంద్రియాలను ఏకం చేసే ఏకైక ఆరోగ్య సాధనం యోగా అని యోగా నిపుణులు తెలియజేశారు.

■ మరికల్‌లోని మాధవరం, మరికల్, కన్మనూర్, పెద్దచింతకుంట, ఎల్లిగండ్ల, పస్పుల, తీలేర్ గ్రామాల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు యోగాసనాలు వేయించారు. అనంతరం యోగాతో కలిగే ఉపయోగాలను యోగా నిర్వాహకులు సుదర్శన్ విద్యార్థులకు, గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరత్నమ్మ, శివకుమార్ పాల్గొన్నారు.

■ మక్తల్ మండలంలోని లింగంపల్లి, మాద్వార్, కాట్రేవ్‌పల్లి, చిట్యాల గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ యోగాను ప్రతిరోజు చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత సొంతం చేసుకోవచ్చని సూచించారు. అలాగే మక్తల్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు అనేక యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు.

■ మాగనూర్‌లోని శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవాలయం అవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా కార్యక్రమం నిర్వహించి యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

■ కొత్తపల్లిలోని నందిగామ గ్రామ ఉపాధి కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి యోగా ప్రాధాన్యతను వివరించి యోగాసనాలు వేయించారు. అలాగే భూనీడు జూనియర్ కాలేజీలో, ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుసుకున్నారు.

■ మద్దూరు పట్టణంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో, డిగ్రీ కళాశాలలో, పెదిరిపాడ్ కేజీబీవీ, పల్లెర్ల తదితర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు యోగా డేను ఘనంగా జరుపుకున్నారు. రోజూ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

■ ఊట్కూరు మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో, లయన్స్‌క్లబ్ సరస్వతీ శిశుమందిర్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉదయమే యోగా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరడి లింగిరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, శిశుమందిర్ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

■ కృష్ణాలో యోగా డేను ఘనంగా నిర్వహించుకున్నారు.మండల కేంద్రంతో పాటు ముడుమాల్, కున్సీ, గుడెబల్లూర్ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేసి యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ ధన్వాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో కలిసి విద్యార్థులు యోగాను చేశారు. అలాగే కొండ్రోనిపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో కిష్టాపూర్, గున్ముక్ల, గోటూర్ గ్రామాలలోని పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు చేసి ఆకట్టుకున్నారు.

■ దామరగిద్ద మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యువజన సంఘాలు పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా పై అవగాహన కల్పించారు. అలాగే వివిధ యోగాసనాలు వేయించి వాటి ప్రాధాన్యతను వివరించారు.



ఊట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..



మరికల్‌లో..



కోస్గిలో..



యోగా డే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి

రాజ్యాంగ విలువలకు ప్రతిరూపం బోసురాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నాయకులు

కృష్ణా: గాంధేయ వాదానికి, రాజ్యాంగ విలువలకు ప్రతిరూపం ఎన్ఎస్ బోసురాజు అని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి ఎన్ఎస్ బోసురాజు పుట్టినరోజు వేడుకలను రాయచూర్ లో నిర్వహించగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆయన ఆత్మకథ చైతన్యసాగర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత కాంగ్రెస్ సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి బోసురాజు జీవించారన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో బోసురాజు ముందుంటారన్నారు. జిల్లా అధ్యక్ష పదవి మొదలుకొని ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మంత్రి స్థాయికి ఎదిగిన నాయకుడు అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను పునికి పుచ్చుకున్న నాయకుడు బోసురాజు అని, పార్టీని విస్తరించడం, బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ ఎక్కడ కష్టాల్లో ఉంటే అక్కడికి ఏఐసీసీ ఆదేశాలతో వెళ్లి పార్టీ కోసం పనిచేసిన నిబద్ధత గల నాయకుడు అన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విశేషంగా కృషిచేశారన్నారు. ధైర్యంగా సంస్కరణల కోసం పోరాడటం, శాస్త్రీయ దృష్టి కోణం ప్రోత్సహించడం, జాతీయ, ప్రాథమిక విధులను పాటించడం ఇవన్నీ ఆయన వ్యక్తిత్వంలో ప్రతినిత్యం కనిపిస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి వారు ఇంకా సేవ చేసేందుకు ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మద్దూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

మద్దూరు: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. ఆయన కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి మద్దూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే మద్దూరులో డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగిస్తుందన్నారు. నూతనంగా ఏర్పాడిన మద్దూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కోస్గి ఎఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఆరుబయట ఎండలోనే మధ్యాహ్న భోజనం



ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వసతుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వరండా సైతం లేకపోవడంతో చిన్నారులు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల ఆవరణలోనే ఎండలో కూర్చొని చేయాల్సి వస్తుంది. వంట గదితో పాటు భోజనం చేయడానికి నీడ సదుపాయం లేకపోవడంతో ఒకవేళ వర్షం వస్తే తరగతి గదుల్లోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలు మండుతున్నప్పుడు బయట కూర్చొని భోజనం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని అధికారులు స్పందించి వసతి కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతిభతోనే గుర్తింపు లభిస్తుంది



నారాయణపేట రూరల్ : ఏ రంగంలోనైనా ప్రతిభ చూపిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ ఆర్ఎం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక డిపోలో శనివారం ఏర్పాటు చేసిన ప్రగతి చక్రం అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జూలైలో ప్రతిభ కనబరిచిన కండక్టర్, డ్రైవర్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు ఇద్దరూ కలిసి సమన్వయంతో పనిచేసి డిపోను మొదటి స్థానంలో నిలపాలన్నారు.

యోగా మందిరం ఏర్పాటు చేయాలి

కోస్గి రూరల్: మండలంలో యోగా చేయడానికి మందిరం ఏర్పాటు చేయాలని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి శనివారం పట్టణ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు.

సాగునీరు అందించాలి

మాగనూర్: మండలంలోని రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వానాకాలం ప్రారంభమై కృష్ణా నదికి వరద వచ్చినా అధికారులు నీటి విడుదల చేయకపోవడంపై మండిపడ్డారు. జూరాల నుంచి నీటిని వృథాగా కిందకి వదులుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ కాలువలకు నీటిని విడుదల చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్వ: మండలంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నర్వ, యాంకి, లంకాల్, రాజుపల్లి, పాథర్చేడ్, ఉందేకోడ్, రాంపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాలలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రహ్మతుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

'డబుల్ బెడ్ రూం' ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ మోసం

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని అప్పిరెడ్డి పల్లి గ్రామానికి మంజూరైన 28 ఇందిరమ్మ ఇళ్లను శనివారం ఆమె భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేస్తుందని, ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి, యువజన సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హనుమంతు, మాధవ్, కనకప్ప, ఎంపీడీవో సుదర్శన్, హౌసింగ్ ఏఈ శ్వేత, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వెలుగని లైట్లు.. తప్పని తిప్పలు



మరికల్: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆరు నెలల నుంచి హైమాక్స్ లైట్లు వెలగడం లేదు. ఇదే చౌరస్తా మీదుగా నారాయణపేట, రాయిచూర్, ఆత్మకూరుకు అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రాత్రి సమయంలో చౌరస్తాలో సూచిక బోర్డులు కన్పించకపోవడంతో వాహనదారులు దారి తప్పుతున్నారు. అలాగే జాతీయ రహదారిపై కిలోమీటర్ మేర ఉన్న సెంట్రల్ లైటింగ్ కూడా వెలుగకపోవడంతో రహదారిపై చీకట్లు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైమాక్స్ లైట్లు, సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దామరగిద్ద: విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని అన్నసాగర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ తప్పనిసరిగా పాటించాలని అలాగే రుచికరమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేలా విద్యా బోధన చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎచ్ఎం ఉషెనప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం



నారాయణపేట రూరల్: ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలను ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ హరి నారాయణ బట్టడ్, సేవా భారతి జిల్లా ప్రతినిధి డాక్టర్ మధన్‌మోహన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వరోగ నివారిణిగా సంగీతం పని చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంగీతం లాంటి కళలలో నైపుణ్యం సాధించాలని సూచించారు.

బస్సు సౌకర్యం కల్పించండి

నారాయణపేట: నారాయణపేట డిపో నుంచి ధన్వాడ మీదుగా కిష్టాపూర్ వరకు ఆర్టీసీ బస్సును నడపాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆయన ధన్వాడ మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ క్రమంలో కిష్టాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన సమస్యను పరిష్కరించాలని డిపో మేనేజర్‌ను కలిసి విన్నవించారు.